మహోన్నత వ్యక్తిత్వం కలిగిన సావిత్రిబాయి ఫూలే ని ఆదర్శంగా తీసుకొని కొన్ని సంవత్సరాలుగా సామాజిక రంగంలో మార్పు కోసం సావిత్రిబాయి ఫూలే ఛారిటబుల్ ట్రస్ట్ పనిచేస్తున్నది. సంస్థ ఆశయాల్లో ఒకటైన మరణానంతరం అవయవ, శరీరదానంపై విస్తృత ప్రచారం కల్పించి ప్రజలను చైతన్య పరుస్తున్నది. నేడు భారతదేశంలో లక్షలాది మంది అభాగ్యులు అవయవదాతల కోసం ఎదురుచూస్తున్నారు. వైద్యరంగ పరిశోధల కోసం, వైద్య విద్యార్థుల బోధనావసరాల కోసం తమ శరీరాలను దానం చేస్తూ అనేక మంది ఈ ఉద్యమంలో భాగస్వాములు అవుతున్నారు.

విశాఖపట్నంలో ఈ పార్థివ శరీరదానమనే మహోద్యమానికి ప్రముఖ రచయిత, హేతువాది అయిన అవసరాల రామకృష్ణారావు గారు 2005లో మృతదేహదాన సమితిని నెలకొల్పటం ద్వారా పునాది వేశారు. దరిమిలా ''ఆశయాలు ఒకటైనప్పుడు ఆశ్రయాలు రెండేలా'' అంటూ వారి సంస్థను సావిత్రిబాయి ఫూలే ట్రస్టులో విలీనం చేసారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ శరీరదాన ఉద్యమం వేలాది మానవతావాదులను కదిలించింది. 2010 జనవరి 4న సావిత్రిబాయి ఫూలే 180వ జయంతి సందర్భంగా రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారిగా అవయవ, శరీరదాతల మొదటి మహాసభను జరిపాం. ఎందరో మేధావులు, మానవతావాదులు, సామాజిక ఉద్యమకారులు పాల్గొన్న ఆ సభలోనే ''ఆంధ్రప్రదేశ బాడీ డోనర్స్ అసోసియేషన'' ఏర్పాటుచేసి సంస్థకు అనుబంధంగా స్వీకరించాం. ఆనాటి నుంచి ఈ ఐదు సంవత్సరాల వ్యవధిలో రెండు తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాల్లో ఈ ఉద్యమాన్ని విస్తరింపజేసాం. అవగాహన సదస్సులు నిర్వహించాము!

ఇతర రాష్ట్రాలలో ఈ ఉద్యమానికి సహకరించే సంస్థలతో కలిపి అఖిల భారత శరీర అవయవదాతల సంఘాన్ని స్థాపించాం. ప్రభుత్వాన్ని ఒప్పించి ‘జీవనదాన ట్రస్ట్’ని ఏర్పాటు చేయించాం. అవయవదానంపై సమగ్రమైన చట్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అవయవదాన బ్యాంకులు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఈ ఉద్యమాన్ని మరింత శక్తిమంతంగా నిర్వహించడానికి అనేక మంది దాతలు, మానవతావాదులు, స్వచ్ఛంద సంస్థలు కలసి పనిచేయాల్సి వుంది.

